ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 9 అక్టోబరు 2025



పైడిమాంబ ఆలయం పునః నిర్మాణానికి నేడు శంకుస్థాపన

విజయనగరం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయం పునః నిర్మాణానికి మాన్సాస్ ఛైర్మన్, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు దేవస్థానం ఈవో కె.శిరీష ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం రూ.కోటీ 80 లక్షల నిధులను దేవస్థానం ఖర్చు చేయనుంది. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్)కింద రూ.కోటి 44 లక్షలు, మిగతా నిధులను ప్రభుత్వం విడుదల చేయనుంది. పైడిమాంబ ఆలయం పునః నిర్మాణంతో పాటు అంతరాలయం, ప్రాకార మండపం, అనివెట్టి మండపం నిర్మించనున్నారు. ఏడాదిలో నిర్మాణం పూర్తికావాలని ప్రభుత్వం నిర్దేశించింది.

రోడ్లకు మంచి రోజులు

- అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.28.20 కోట్లు
- నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం
- మారనున్న తొమ్మిది రోడ్లు



విజయనగరం - పాలకొండ రోడ్డులో మజ్జిరాముని పేట వద్ద రహదారి దుస్థితి

విజయనగరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రహదారులకు మహర్దశ రానుంది. అభివృద్ధికి నోచని కీలక రోడ్లను బాగు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు నిధులు మంజూరు చేసింది. తొమ్మిది రహదారుల అభివృద్ధికి రూ.28.20 కోట్లు విడుదల చేసింది. ఇందులో అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారులు ఉన్నాయి. రాష్ట్ర రహదారులకు సంబంధించి బొబ్బిలి-రాజేరు-తెర్లాం రోడ్డులో 9 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.4 కోట్లు... గజపతినగరం-మెంటాడ రోడ్డులో 9.2 కిలోమీటర్లకుగాను రూ.4.50 కోట్లు.. చింతపల్లి-విజయనగం-ముక్కాం రహదారికి సంబంధించి 18.8 కిలోమీటర్లకు రూ.4.50 కోట్లు.. విజయనగరం-పాలకొండ రోడ్డులో 9 కిలోమీటర్లకుగాను రూ.4 కోట్లు... భీమసింగి- ఎస్‌కోట రోడ్డులో 5.8 కిలోమీటర్ల రహదారికి రూ.3.30 కోట్లు... భీమసింగి-కొత్తవలస రోడ్డులో 3 కిలోమీటర్లకుగాను రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. జిల్లా రహదారులకు సంబంధించి విజయనగరం-కొత్తవలస రహదారి వయా బొడ్డవర, పెద్దవేమలి, పినవేమలి 8 కిలోమీటర్ల రహదారికి రూ.2.60 కోట్లు, చీపురుపల్లి-లావేరు రోడ్డులో వయా చిన్ననడింపల్లి వరకూ 10.90 కిలోమీటర్లకుగాను రూ.3.80 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

వైసీపీ హయాంలో అస్తవ్యస్తం..

వైసీపీ హయాంలో జిల్లా ప్రజలు నరకయాతన పడ్డారు. రహదారులు దారుణంగా తయారయ్యాయి. పూర్తిగా రూపం కోల్పోయాయి. గోతుల్లో దారిని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసింది. చివరకు చేతులు ఎత్తేసింది. ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర రూపంలో అందించిన సొమ్ము ఆటో మరమ్మతులకు సరిపోయేది. రోడ్డుపైకి వచ్చిన వాహనం గమ్యస్థానానికి వెళ్లేవ రకూ ఒకటే ఆందోళన. మరోవైపు ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోయేది. సామర్థ్యానికి మించి వాహనాలు రోడ్లపైకి రావడంతో అవి ఛిద్రమయ్యేవి. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు మొర పెట్టుకున్నా అప్పటి సీఎం జగన్ పెడచెవిన పెట్టారు. పర్యవసానంగా ఎన్నికల్లో ఆ పార్టీ దారుణంగా దెబ్బతింది. తాము అధికారంలోకి వస్తే రహదారులను అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఇప్పుడు రహదారులను బాగుచేసేందుకు (మిగతా 8వ పేజీలో..)

తీరనున్న దారి కష్టాలు..

జిల్లాలో అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారులు ఉన్నాయి. తగరపువలస-విజయనగరం-రాజాం రహదారి ప్రధానమైనది. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేక దారుణంగా మారింది. దీనిని పీపీపీ పద్ధతిలో పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా చిలకపాలెం-రాజాం-జైపూర్ రోడ్డు.. అలికాం-పార్వతీపురం- రాయగడ రోడ్ల నిర్మాణంతో ఉమ్మడి జిల్లావాసుల కష్టాలు తీరుతాయి. జిల్లాలో 1505.64 కిలోమీటర్ల మేర అన్నిరకాల రహదారులు ఉన్నాయి. ఇందులో రాష్ట్ర 546.64 కిలోమీటర్లు, జిల్లాలోని మేజర్ రహదారులు 791.57 కిలోమీటర్లు, ఇతర రోడ్లు 167.08 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటిలో 884 కిలోమీటర్ల మేర రోడ్లు దారుణాతి దారుణంగా తయారయ్యాయి. వీటి మరమ్మతులకు కూటమి ప్రభుత్వం గత ఏడాది జనవరిలో రూ.23.52 కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడు మరోసారి రూ.28.20 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో చాలావరకు రహదారి కష్టాలు తీరే అవకాశం ఉంది.

సొంతింటిపై ఆశలు

- మంత్రి నారాయణ ప్రకటనతో లబ్ధిదారుల్లో ఊరట
- టిడ్కో ఇళ్ల వద్ద కానరాని మౌలిక సౌకర్యాలు
- ఐదేళ్లు నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- బిల్లులు అందక పనులు ఆపేసిన ఏజెన్సీ

● టిడ్కో ఇళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. ఇప్పటికే పూర్తయిన వాటిని లబ్ధిదారులకు ప్రతి శనివారం అందిస్తాం. మిగతా వాటిని ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేస్తాం. జూన్ నాటికి మొత్తం ఇళ్లను లబ్ధిదారులకు అందేలా చూస్తాం.

-శాసనసభలో పురపాలక శాఖ మంత్రి నారాయణ ఇటీవల చేసిన ప్రకటనిది



రాజాంలో మధ్యలో ఆగిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణం



రాజాం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి)

ఆరేళ్లుగా తీవ్ర నిరాశలో ఉన్న టిడ్కో లబ్ధిదారులకు తాజాగా మంత్రి నారాయణ అసెంబ్లీలో చేసిన ప్రకటన ఊరటనిచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అప్పట్లో పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 60 నుంచి 90 శాతం పనులు పూర్తిచేసింది. అంతలో 2019లో అధికార మార్పిడి జరిగింది. వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టిపెట్టలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసింది. ఇప్పుడు వాటిని పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. తాజా పరిణామంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.

టిడ్కో ఇళ్లకు సంబంధించి విజయనగరం నగరపాలక సంస్థ ప్రజలకు సారిపల్లిలో 2,880 ఇళ్లు మంజూరయ్యాయి. వివిధ కారణాలతో 2656 ఇళ్ల నిర్మాణ పనులు జరిగాయి. 82 బ్లాకుల్లో 32 ప్లాట్లలో 300 చదరపు అడుగుల ఇళ్లు 1536, 365 చదరపు అడుగుల ఇళ్లు 192, 430 చదరపు అడుగుల ఇళ్లు 928 చేపట్టారు. తొలి ఫేజ్‌లో భాగంగా 2656 ఇళ్లను నాలుగు విడతల్లో అప్పగించారు. ఇవే కాకుండా విజయనగరం సమీపంలో సోనియా నగర్‌లో 1280 ఇళ్లు మంజూర య్యాయి. అందులో 1120 ఇళ్ల పనులు పూర్తయ్యాయి. 300 చదరపు అడుగుల ఇళ్లు 480, 365 చదరపు అడుగుల ఇళ్లు 256, 430 చదరపు అడుగు ఇళ్లు 384 ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 91 శాతం పనులు పూర్తయ్యాయి. మౌలిక వసతులకల్పన పనులు 15 శాతం జరిగాయి. రహదారులు, కాలువలు, పాఠశాలలు, ఆస్పత్రులు వంటివి నిర్మించాల్సి ఉంది. ఆ వైపుగా వైసీపీ ప్రభుత్వం దృష్టిసారించలేదు.

● బొబ్బిలి పట్టణానికి సంబంధించి రామన్నదొరవలస వద్ద టిడ్కో ఇళ్లను మంజూరు చేశారు. ఇక్కడ 35 బ్లాకుల్లో 1680 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 1200 గృహాలకు సంబంధించి లాటరీ తీసి లబ్ధిదారులకు అందజేశారు. అయితే ఇంతవరకూ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు ఇష్టపడ లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడంతో పరిస్థితి మరింత తీసికట్టుగా మారింది. ఒక ఏజెన్సీకి పనులు అప్పగించడం, బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో మౌలిక వసతులకు సంబంధించి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

● రాజాం మునిసిపాల్టీకి సంబంధించి కంచారంలో 336 ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. కానీ అప్పట్లో వివిధ కారణాలు చూపి పనులు ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వం థర్డ్ పార్టీగా చూపి ఒక ఏజెన్సీకి పనులు అప్పగించింది. కానీ సంబంధిత ఏజెన్సీకి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలో ఆపేశారు.

● నెల్లిమర్ల నగర పంచాయతీలోనూ అదే పరిస్థితి. 576 ఇళ్లను మంజూరు చేశారు. పనులు చేపట్టిన (మిగతా 8వ పేజీలో..)

కలలు కనండి.. సాకారం చేసుకోండి

- అబ్దుల్‌కలాం మనకు ఆదర్శం
- షార్ కంట్రోలర్ అండ్ డిప్యూటీ డైరెక్టరు రమేష్
- ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు
- పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న షార్ డిప్యూటీ డైరెక్టరు రమేష్, ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం మాదిరిగా కలలు కని వాటిని సాకారం చేసుకునేందుకు శ్రమించాలని షార్(సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్) కంట్రోలర్ అండ్ డిప్యూటీ డైరెక్టరు జి.రమేష్ విద్యార్థులకు సూచించారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా స్థానిక రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు కళాశాలలో జరుగుతున్న కార్యక్రమానికి ఆయన బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి తరం, భావి తరం ప్రపంచంలో శాస్త్రసాంకేతిక రంగంలో దూసుకుపోయేందుకు బాటలు వేయాలన్న లక్ష్యంతోనే ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ 90 నిమిషాలకు ఓ కొత్త అంశం వెలుగులోకి వస్తోందని, వేలకొద్దీ ఉన్న నక్షత్రాలు, గ్రహాల ఉనికి గురించి విస్తృతమైన పరిశోధనలు నిరంతరం సాగుతూ ఉన్నాయన్నారు. స్పేస్ టూరిజం కూడా అందుబాటులోకి రానుందని, మన భావితరాల వారు ఇంకెన్నో వింతలను, పరిశోధనల ఫలితాలను చూస్తారన్నారు.

● నిర్వాహక కమిటీ ఛైర్మన్ టి.హరికృష్ణ మాట్లాడుతూ సాంకేతికత లేని సమాజాన్ని ఊహించుకోవడం కష్టమని, ప్రపంచానికి పోటీగా మనమూ ఎదగడానికి సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఒకటో తరగతి నుంచి పీజీ విద్యార్థి వరకు సాంకేతికతపై స్పష్టమైన అవగాహన (మిగతా 8వ పేజీలో..)

సరస్ ద్వారా రూ.11కోట్ల అమ్మకాలు 6

- ఎగ్జిబిషన్‌కు ఆదరణ: కలెక్టర్

నాటి లేఖలు ఓ జ్ఞాపకం

- పదిలంగా దాచుకున్న ఎంతోమంది
- నేడు ప్రపంచ తపాలా దినోత్సవం

6

45 రోజుల్లో చలానా కట్టాల్సిందే

- ఐదుకు మించి చలానాల జారీచేస్తే లైసెన్స్ రద్దు 6
- కేంద్ర మోటార్ వెహికల్స్ రూల్స్-1989కి సవరణకు ప్రతిపాదన

హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రామసుందర్ రెడ్డి



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యాశాఖతో పాటు అన్ని విభాగాల అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు తాగడానికి వేడినీరు మాత్రమే సరఫరా చేయాలని, వంట పదార్థాలు సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయాలని చెప్పారు. లక్ష్యాల మేరకు ఏ రోజు కార్యక్రమాలు ఆరోజు పూర్తి చేయాలన్నారు. సచివాలయాలతో మ్యాపింగ్ షెడ్యూల్ చేయడం, డాక్యుమెంటేషన్, సెస్ 8 కార్యక్రమాల అప్‌లోడ్ తప్పనిసరి అని నిర్దేశించారు. ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీపై పరిశ్రమల శాఖద్వారా ఎంఎస్‌ఎంఈలలో ఎగ్జిబిషన్‌లు నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో సూపర్ జీఎస్టీపై (మిగతా 8వ పేజీలో..)

ఆరు పదులు దాటితే ఆసరా

- వయో వృద్ధులకు డిజిటల్ కార్డులు 6

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు 6


జేఎన్‌టీయూ వీసీగా వెంకటసుబ్బారావు




విజయనగరం/ కలెక్టరేట్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ (గురజాడ వర్సిటీ)విజయనగం వైస్ చాన్సలర్‌గా డాక్టర్ వి.వెంకటసుబ్బారావును నియమిస్తూ గవర్నర్ అబ్దుల్‌నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన జేఎన్‌టీయూ కాకినాడలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా, రెక్టార్‌గా పనిచేస్తున్నారు. 2025 ఎంసెట్ కన్వీనర్‌గా బాధ్యతలు చూశారు. సుబ్బారావు ఉప కులపతి పదవిలో మూడేళ్లు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి ఇన్‌చార్జి వీసీగా పని చేశారు. తిరిగి ఆమె కంప్యూటర్ సైన్స్ విభాగంలో విధుల్లో ఉండనున్నారు.

పథకాలకు దూరంగా పేదలు

- హౌస్ హోల్డ్ సర్వేతో రేషన్ కార్డు, పింఛన్లు అందని వైనం
- స్కిప్ ఆప్షన్ ఇస్తేనే ఉపయోగం
- సిక్స్‌స్టెప్ వాల్యుయేషన్‌కు అర్హత ఉన్నా అన్యాయం
- ప్రతి గ్రామంలోనూ అర్హులు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు





వేపాడ మండలం అరిగిపాలెంకు చెందిన జొన్నపల్లి దేముడమ్మకు నలుగురు కుమారులు. అంతా కుటుంబాలతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈమె మాత్రం చిన్న కుమారుడు పెంటయ్యతో కలిసి ఉంటోంది. తల్లి, భార్య, పిల్లలు అందరికీ ఒకే రేషన్ కార్డు ఉంది. మూడేళ్ల క్రితం అనారోగ్యంతో పెంటయ్య మృతి చెందాడు. దీంతో భార్య నాగమణి వితంతు సామాజిక పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకొనేందుకు సిగరాయి గ్రామ సచివాలయ అధికారులను సంప్రదించింది. ఈ కుటుంబం పేరున ఉన్న రేషన్ కార్డుపై దేముడమ్మకు సామాజిక పింఛన్ అందుతున్నందున మరో పింఛన్ ఇవ్వడం కుదరదని వారు తేల్చిచెప్పేశారు. వారంతా ఒకే కుటుంబ సభ్యులంటూ గతంలో జరిగిన హౌస్ హోల్డ్ సర్వేలో నమోదైన వివరాలే ఇప్పుడు అన్నింటికీ ప్రాతిపదిక అవుతోంది. స్కిప్ ఆప్షన్ ఇవ్వాలని వారంతా చాలా రోజులుగా కోరుతున్నారు. ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.

శృంగవరపుకోట, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): కొత్తగా రేషన్ కార్డు, సామాజిక పింఛన్ కావాలనుకున్నవారికి గతంలో జరిగిన హౌస్‌హోల్డ్ సర్వే ప్రతిబంధకంగా మారింది. సిక్స్‌స్టెప్ వాల్యుయేషన్‌లో అర్హులుగా నిర్ధారించినప్పటికీ చాలా మంది రేషన్‌కార్డు, సామాజిక పింఛన్‌లను పొందలేకపోతున్నారు. వాస్తవానికి రేషన్ కార్డు ఉంటే దారిద్ర్యరేఖకు దిగవనున్న (బీపీఎల్) కుటుంబంగా పరిగణిస్తారు. ఈకుటుంబాలకే ప్రభుత్వ పరంగా పథకాలు, రాయితీలు అందుతాయి. అందుకే ప్రతి కుటుంబం రేషన్ కార్డును పొందేందుకు ప్రయత్నిస్తుంది. అలాగే ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన వ్యక్తి వెంటనే ఈ కార్డునుంచి తప్పుకుంటున్నాడు(స్కిప్). కొంత మంది ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపుదారులు (మిగతా 8వ పేజీలో..)

కేసులు త్వరితగతిన పరిష్కరిస్తుండాలి: ఎస్పీ



సీఐ, ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

భోగాపురం, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ల్లో కేసులు త్వరితగతిన పరిష్కరిస్తుండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ముందుగా పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని సెల్, కంప్యూటర్ తదితర గదులను పరిశీలించారు. ఈప్రాంతంలో ఎటువంటి కేసులు నమోదవుతున్నాయి.. జాతీయ రహదారులపై ప్రమాదాల కేసులేంటి తదితర వివరాలపై సీఐ దుర్గాప్రసాద్‌తో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు ఏర్పాటవుతున్న కారణంగా ఈ ప్రాంతంలో ప్రత్యేక దృష్టితో నిఘా ఉంచాలన్నారు. కేసులు పరిష్కరిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ పి.సూర్యకుమారి, హెచ్‌సీలు శ్రీనివాసరావు, జ్యోతి ఉన్నారు.



ఆరుపదులు దాటితే ఆసరా

- వయో వృద్ధులకు డిజిటల్ కార్డులు
- ఎన్నో ప్రయోజనాలు వర్తించేలా చర్యలు
- సచివాలయాలలో దరఖాస్తుకు అవకాశం

రాజాం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):

సీనియర్ సిటిజన్లకు డిజిటల్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆరు పదులు దాటిన వృద్ధులందరికీ వీటిని అందించనుంది. గ్రామ, వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ కార్డు పొందిన వయో వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రాయితీ పొందేందుకు వీలుంటుంది.

దరఖాస్తు చేసుకోండిలా..

డిజిటల్ కార్డు కావాలనుకునే వారు గ్రామ, వార్డు సచివాలయా లలో దరఖాస్తు చేసుకోవా లి. జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో కూడా దరఖాస్తులు అందజేయవ చ్చు. దరఖాస్తు సమయంలో పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్‌లు, బ్లడ్ గ్రూపు తదితర పత్రా లు అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన వారం, పదిరో జుల్లో డిజిటల్ కార్డును పొందచ్చు. 60 ఏళ్ల దాటిన పురుష లు, 58 ఏళ్ల దాటిన మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ప్రభుత్వం తోడ్పాటు..

పిల్లల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశ లూ కష్టపడి వారిని ప్రయోజకులు చేసిన చా లామంది తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదర ణకు గురవుతున్నారు. పిల్లలు తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. పాశ్చాత్య ధోరణి, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో అనుబంధాలకు అడ్డుగోడలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వయోవృద్ధుల సంక్షేమా నికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకచట్టాన్ని తీసుకురాగా రాష్ట్ర ప్రభుత్వం వారికోసం సీని యర్ సిటిజన్ డిజిటల్ కార్డుల్ని అంది స్తోంది. వీటిద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు వెసులుబాటు కల్పించింది.

దేశంలో ఎక్కడైనా..

సీనియర్ సిటిజన్‌కార్డుతో దేశవ్యాప్తంగా ఎక్కడైనా ప్రభుత్వసేవలు సులభంగా, వేగంగా పొందవచ్చు. ఈ కార్డు ఉంటే ఇతర గుర్తింపు పత్రాలు చూపించాల్సిన అవసరం లేదు. చివరి అంకంలో కుటుంబసభ్యుల నిరాదరణకు గురైన వారికి, అనాథ వృద్ధులు.. అనాథ ఆశ్రమాల్లో సేవలు పొందేందుకు సైతం ఈ కార్డు ఉపయోగపడుతుంది.

ప్రయోజనాలివిగో..

- డిజిటల్ కార్డుంటే ఆర్టీసీ బస్సుల్లో టికెట్ పై 25 శాతం రాయితీ కల్పిస్తారు. దూర ప్రాం తాల బస్సులు మినహాయిస్తే ఇతర అన్ని బస్సు సర్వీసుల్లో రెండుసీట్లు రిజర్వ్ చేస్తారు.
- రైల్వేస్టేషన్లలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లుంటాయి. అవసరమైన వారికి వీల్‌ఛైర్ సదుపాయం కల్పిస్తారు. 60 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు, 45 ఏళ్లకు పైబడి ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, గర్భిణులకు రిజర్వేషన్ సమయంలో లోయర్ బెర్త్‌ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పిస్తారు.
- ఈ కార్డున్న వారికి న్యాయస్థానాల్లో కేసు ల విచారణ సమయంలో ప్రాధాన్యం లభిస్తుంది. పాస్‌పోర్ట్ సేవాఛార్జీలలో 10 శాతం రాయితీ ఉంటుంది.
- బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 0.5 శాతం అదనపు వడ్డీ, 80 ఏళ్లు దాటితే 1 శాతం వడ్డీ అదనంగా ఇస్తారు.
- 60 ఏళ్ల పైన వయసుంటే రూ.3 లక్షల వరకూ, 80 ఏళ్లు దాటితే రూ.5 లక్షల వరకూ ఆదాయపుపన్ను మినహాయింపు ఉంటుంది.
- హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే సెక్షన్ 80సి ప్రకారం కింద పన్ను మినహాయింపు ఉంటుంది.



ఆలయం వెలుపుల సిరిమాను వద్ద భక్తుల కోలాహలం

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు

విజయనగరం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): తోలేళ్ల, సిరిమానోత్సవం రోజున పైడి మాంబను దర్శించుకోవడానికి అవకాశం లేని భక్తులు బుధవారం తరలి వచ్చారు. దీంతో మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి భక్తు లతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ భక్తులు అధిక సంఖ్యలో పైడి మాంబను దర్శించుకున్నారు. దర్శనం ఎక్కడా ఆపకుండా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

సిరిమాను చెక్కలకు డిమాండ్..

ఉత్సవానికి వినియోగించిన సిరిమానును మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడి వద్ద ఉంచారు. సిరిమాను చెక్కల కోసం భక్తులు పోటీ పడ్డారు. పైడిమాంబ ఆలయ సేవకులు దగ్గరుండి ఈ చెక్కలను భక్తులకు అందజేశారు.



రాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

సరస్ ద్వారా రూ.11కోట్ల అమ్మకాలు

- ఎగ్జిబిషన్‌కు ఆదరణ: కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విజయనగరం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్) ద్వారా రూ.11 కోట్ల రుపాయలు అమ్మకాలు జరిగాయని, ప్రపంచానికి కళాకారులను పరిచయం చేసే వేదిక సరస్‌గా నిలిచిందని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం విజయనగరంలో సరస్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గత నెల 28వ తేదీ నుంచి నిర్వహిం చిన సరస్ ఎగ్జిబిషన్‌కుఆదరణ లభించిందన్నారు. వివిధ కళ వృత్తుల వారిని ప్రపంచా నికి పరిచయం చేయడానికి సరస్ వేదికగా నిలిసింద న్నారు. సరస్ ఎగ్జిబిషన్‌లో 21 రాష్ట్రాలకు చెందిన 310 మంది ఎస్‌హెచ్‌జీ బృందాలు 244 స్టాళ్లను ఏర్పాటు చేశాయని తెలి పారు. ఎస్‌హెచ్‌జీలకు వినియోగదారులతో అనుసంధానం చేయడం ద్వారా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ము కొని లబ్ధి చేకూరేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే 30శాతం మార్కెట్ పెరిగిందని చెప్పారు. ఇక్కడి ఎస్‌హెచ్‌జీలకు ఉన్న టాలెంట్ ప్రదర్శించే అద్భుత అవకాశం లభించిందన్నారు. అన్ని విధాలా సహకరించి ప్రోత్స హించిన కలెక్టర్‌కు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస పణి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడీ సావిత్రి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, స్త్రీ సమాఖ్య అధ్యక్షురాలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సభ్యులు, బ్యాంకర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళ్లను రక్షించుకోవాలి



కన్ను, కనుపాప ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

రాజాం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కళ్లను రక్షించుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ సప్పటి వసంతరావు సూచించారు. బుధవారం మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు కన్ను, కనుపాప ఆకారం ప్రదర్శన ఏర్పాటు చేశారు.

నాటి లేఖలు.. ఓ జ్ఞాపకం

- పదిలంగా దాచుకున్న ఎంతోమంది
- నేడు ప్రపంచ తపాలా దినోత్సవం



బొబ్బిలి హెడ్ పోస్టాఫీసు





రెవెన్యూ స్టాంపులు



బొబ్బిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి)

అప్పట్లో పోస్టుమ్యాన్ సైకిల్ బెల్ కొడుతూ ఆ వీధిలోకి వచ్చాడంటే ఏ ఇంటిముందు ఆగుతాడోనని ఎదురు చూసేవారు. బంధువుల నుంచో.. స్నేహితుల నుంచో లేఖ వచ్చిందంటే దాన్ని అపురూపంగా చదువుకునే వారు. బంధువులు, స్నేహితుల క్షేమసమాచారం తెలుసుకునే వారు. అప్పట్లో ఏ విషయం తెలుసుకోవాలన్నా తపాలాశాఖ ద్వారానే. నాటి లేఖలు నేటికీ పదిలంగా దాచుకున్న వారు ఎందరో ఉన్నారు. ప్రతీఏటా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని అక్టోబరు 9 న జరుపుకుంటారు. ఈ ఏడాది పోస్ట్ ఫర్ పీపుల్-లోకల్ సర్వీస్, గ్లోబల్ రీచ్ అనే సందేశంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలపై కథనం..

పోస్టుమ్యాన్ అంటే ఎనలేని గౌరవం..

నెలకు 137 రూపాయల జీతంతో ఉద్యోగంలో చేరి 34 ఏళ్ల పాటు తపాలాశాఖలో సేవలందించాను. ఉత్తరాల ను అందజేయడానికి గ్రామాల్లోనికి వెళ్లేటప్పుడు నన్ను చూడగానే ఆనందంతో ఉప్పొంగిపోయేవారు. చాలా గౌర వంగా చూసేవారు. ఆప్యాయంగా పలకరింపులు ఉండే వి. ఆ గౌరవం తలచుకుంటే ఇప్పటికీ చాలా ఆనందంగా ఉంటుంది. తపాలా సేవల్లో ఇప్పుడు పెనుమార్పులు వచ్చేశాయి. ఇప్పటి తరం వారికి ఆనాటి పోస్టల్ విషయాలు పెద్దగా తెలియవు.

-ఎస్.అప్పారావు, రిటైర్డ్ పోస్టుమ్యాన్, మిర్తివలస

తపాలాశాఖలో వినూత్న మార్పులు..



ఆధునిక కాలంలో తపాలా సేవల్లో వినూత్న మార్పులు చోటుచేసు కున్నాయి. మొబైల్ ఫోన్లు అందుబాటులోకి రావ డంతో ఉత్తరాలు రాసు కునే ఒరవడి పూర్తిగా పోయింది. అయితే తప్పనిసరిగా పోస్టల్ ద్వారా అనేక తాఖీదులు, నోటీసులు తదితర వాటిని అందజేయాల్సి ఉండడంతో ఈ సేవలను చాలా మంది కొనసాగిస్తున్నారు. బ్యాంకింగ్ సేవలు పోస్టాఫీసులో చాలా పెరిగాయి. బీమా సదు పాయం, పొదుపు ఖాతాలు, ప్రభుత్వాల సంక్షేమ పథకాలు చాలావరకు మా శాఖ ద్వారా జరుగు తున్నాయి. గతంలో మనీ ఆర్డరు పంపడానికి జాప్యం జరిగేది. ఇప్పుడు ఆన్‌లైన్ సేవలు రావడంతో సత్వరం బట్వాడా జరుగుతోంది.

-గంట రాధ, బొబ్బిలి హెడ్‌పోస్టుమాస్టరు

మా ప్రేమను పండించింది తపాలా శాఖనే..

బొబ్బిలి పట్టణం ఇందిరమ్మకాలనీకి చెందిన రాయ గడ జగదీశ్-భాగ్యం దంపతులు తమ అనుభవాలను ఇలా వివరిస్తున్నారు. '30 ఏళ్ల క్రితం మా ఇద్దరి గాఢమైన ప్రేమ ఫలించడానికి తపాలాశాఖనే. ప్రేమపావురం మాదిరిగా మాకెంతో సహకరించింది. వేర్వేరు ప్రాంతాలలో నివసించే మేము పరస్పరం ప్రేమించుకున్నాం. అప్పట్లో ఫోన్, సెల్‌ఫోన్ సౌకర్యా లు లేవు. ఉత్తరాల ద్వారానే మా మధ్య ప్రేమాయ ణం సాగింది. పోస్టుమ్యాన్ ఉత్తరం అందించాడంటే అదో పండుగలా ఉండేది. ఆ జ్ఞాపకాలు మధురాతి మధురం. వందలకొద్దీ ప్రేమలేఖలను రాసుకున్నాం. వాటిని ఇప్పటికీ భద్రంగా దాచుకున్నాము. మా ప్రేమ జీవితం వైవాహిక జీవితంగా మారింది. ఇద్దరు పిల్లలతో ఆనందమయంగా గడుపుతున్నాం. ఆనాటి మా ప్రేమలేఖలను ఇరువురికి చేరవేయడంలో తపా లాశాఖ చేసిన సేవను మరిచిపోలేం. మా పిల్లలకే కాకుండా వారి పిల్లలకు ఈ మధుర జ్ఞాపకాలను కథలుగా చెప్పుకుంటున్నాము.

-జగదీశ్-భాగ్యం దంపతులు

మత్స్యశాఖ తీరు మారదా?

- తీవ్రంగా సిబ్బంది కొరత
- సొసైటీలకు అందని సేవలు
- నిరాశ చెందుతున్న మత్స్యకారులు

రాజాంలోని మత్స్యశాఖ కార్యాలయం ఇది. నిత్యం తాళం వేసే ఉంటుంది. అసలు ఈ కార్యాలయంలో అధికారులు ఎప్పుడూ కనిపించరు. దీంతో శాఖాపరమైన పనిమీద వచ్చిన వారు ఉసూరుమంటూ వెనక్కి వెళ్తున్నారు.



రాజాం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న మత్స్యశాఖ భవనం

రాజాం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మత్స్యశాఖ కార్యకలాపాలు నిరాశాజనకంగా ఉన్నాయి. సిబ్బంది కొరతే ప్రధాన కారణం. ప్రస్తుతం డీడీ స్థాయి అధి కారులు ఇద్దరున్నారు. సగానికిపైగా మండలా ల్లో మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు లేరు. ఒకరిద్దరే తనిఖీ అధికారులు ఉన్నారు. దీంతో కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరులో చెరువులు, కాలువల్లో చేప పిల్లల పంపిణీ అనేది మత్స్యశాఖ బాధ్యత. ఈ ఏడాది ఈ తంతు చాలా చోట్ల జరగలేదు. ఈ ఏడాది 1.10 కోట్ల చేప పిల్లలను విడిచిపెట్టాలని లక్ష్యంగా పెట్టుకోగా 50 లక్షల పిల్లలను మాత్రమే విడిచిపెట్టగలిగారు. జిల్లాలో సము ద్ర తీర మండలాలుగా భోగాపురం, పూస పాటిరేగ ఉన్నాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా 8,111 చెరువులు, ఇందులో 202 మత్స్యకార చెరువులు ఉన్నాయి. మత్స్యకార సంఘాలు 54 ఉండగా.. అందులో 6 వేల మంది వర కూ సభ్యులుగా ఉన్నట్టు గణాంకాలు చెబు తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 18 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు ఉన్నట్టు తెలు స్తోంది. మత్స్యకారుల అభివృద్ధి అనేది మత్స్యశాఖపై ఆధారపడి ఉంది. సాగునీటి శాఖ, పశుసంవర్థక శాఖ వంటివాటితో సమ న్వయం చేసుకొని ముందుకు సాగాల్సి ఉంటుంది కానీ ఐదేళ్ల వైసీపీ హయాంలో మత్స్యశాఖ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. ఫిష్ ఆంధ్రా పేరిట చేపలు, చికెన్, మటన్ షాపుల ఏర్పాటుకే పరిమితం అయ్యిందన్న విమర్శలున్నాయి.


ప్రభుత్వానికి నివేదించాం..

జిల్లాలో మత్స్యశాఖపరంగా ప్రత్యేక ప్రణా ళికలు రూపొందించాం. వాటిని ప్రభుత్వానికి నివేదించాం. అయితే శాఖలో సిబ్బంది కొరత ఉంది. అయినా సరే ఇబ్బందులను అధిగమి స్తున్నాం. జిల్లాలో 27 ఫిష్‌పాండ్లు తవ్వేందు కు రూ.1.80 లక్షలు మంజూరయ్యాయి. వివి ధ కారణాలతో వాటి తవ్వకాలు జరగలేదు. అందుకే చేపల పెంపకంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది సహకరించాలి.

-ఎన్.నిర్మలాకుమారి, మత్స్యశాఖ డీడీ, విజయనగరం

45 రోజుల్లో చలానా కట్టాల్సిందే





- ఐదుకు మించి చలానాల జారీచేస్తే లైసెన్స్ రద్దు
- కేంద్ర మోటార్ వెహికల్స్ రూల్స్-1989కి సవరణకు ప్రతిపాదన

మెంటాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. నిబంధనలను పాటించకపోతే భారీ వడ్డను సిద్ధమ వుతోంది. చలానా పడితే పోలీసులు ఆపినప్పుడు చూద్దాంలే అంటే ఇకపై కుదరదు. 45 రోజుల్లోగా చెల్లించకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకోనున్నారు. అంతేకాదు డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కాకపోవచ్చు. ఐదుకి మించి చలాన్లు ఉంటే ఏకంగా లైసెన్సే రద్దుచేయనున్నారు. ఈ మేరకు కేంద్ర మోటార్ వెహికల్స్ రూల్స్-1989ను కేంద్ర రవాణాశాఖ సవరణలను ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌ను తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇకముందు వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందే. నిర్లక్ష్యం వహిస్తే భారీమూల్యం చెల్లించక తప్పదని రవాణాశాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రతిపాదించిన రూల్స్ ప్రకారం..

- చలానాల జారీ, చెల్లింపు, అపీల్ చేయడం వంటి అంశాలను డిజిటల్ మోనటరింగ్ ఆపరేషన్ ద్వారా వేగవంతం చేయనున్నారు.
- మోటార్ వెహికల్ యాక్ట్ కింద ఒక వాహనంపై ఐదు అంతకుమించి చలాన్లు జారీ అయితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేస్తారు.
- మద్యం సేవించి వాహనం నడపినా, నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైనా లైసెన్స్ రద్దుచేసే వెసులుబాటు ఇప్పటికే ఉండగా,ఆ నిబంధనలు కూడా కొనసాగుతాయి.
- ప్రస్తుతం చలాన్ చెల్లింపునకు 90 రోజులు సమయంఉండేది. ఆ గడువు దాటినా పోలీసులు పట్టుకుంటే తప్ప వాహనచోదకులు స్పందించేవారు కాదు. ప్రస్తుతం గడువును 45 రోజులకు తగ్గించారు.
- ఆలస్యం చేస్తే సదరు వాహనంపై లావాదేవీలను రవాణా శాఖ స్తంభింపజేస్తుంది. దీంతో వాహనాన్ని ఎవరికి విక్రయించలేరు. అలాగే,లైసెన్స్‌లో చిరునామా,పేరు మార్పుతోపాటు రెన్యువల్ కూడా జరగదు.
- చలానా కట్టకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం ఇక మీదట పోలీసులకు ఉంటుంది. ఇప్పటివరకు చలానలు వాహనచోదకుడి పేరుతో జారీ అయ్యేవి. ఇకపై, ఆ సమయంలో యజమాని వాహనం నడపలేదని నిరూపిస్తే డ్రైవింగ్ చేసిన వ్యక్తిని బాధ్యుడ్ని చేస్తారు.

ప్రతిపాదనలు అమల్లోకి వస్తే..

ఇప్పటివరకు పోలీసులు చలానాల విషయంలో ఉభయతారక మంతాన్ని అనుసరిస్తున్నారు. వాహనంపై ఎన్ని చలానాలు పెం డింగ్‌లో ఉన్నప్పటికి, తనిఖీ సమయంలో ఒకటి రెండు చలా నాలను చెల్లించుకొని మిగిలినవి వీలైనంత త్వరగా క్లియర్ చేసు కోమని సూచించి వదిలిపెట్టేవారు. దీంతో ప్రభుత్వానికి కొంత మేరకైనా చలాన్ల రూపంలో ఆదాయం రావడంతోపాటు వాహన చోదకులకు కూడా ఇబ్బంది ఉండేదికాదు. ఇందుకోసమే పోలీసు లు మీసేవ లేదా ఇతర నెట్ సెంటర్లు అందుబాటులో ఉండే ప్రాంతాన్ని ఎంచుకొని అక్కడే తనిఖీలు చేపట్టావారు. అంతకు ముందు చలానాల వసూలులో పోలీసులపై ఆరోపణలు ఉండేవి. మాన్యువల్ క్లియరెన్స్ వల్ల వసూలు చేసిన చలానాల డబ్బులో కొంత దారిమళ్లేదన్న విమర్శలొచ్చేవి. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈనేపథ్యంలోనే మీసేవ, నెట్ సెంటర్లు ఉన్నచోటు వద్దే తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే కేంద్ర రవాణా శాఖ తాజాగా తెరపైకి తీసుకొస్తున్న ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఐదు అంతకుమించి చలాన్లు పెండింగ్‌లో ఉంటే వాహనచోదకుల లైసెన్స్ రద్దవుతుంది.

మరమ్మతులేక.. మట్టితో కప్పేసి

● వాహనచోదకులకు అగచాట్లు
● రాజాం నియోజకవర్గంలో అధ్వానంగా మారిన రహదారులు

రాజాం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోగల గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మతులు నిర్వహించకుండా మట్టితో కప్పేస్తున్నారు. ఐదేళ్లలో వైసీపీహయాంలో రహదారులు కనీసం మరమ్మతులకు నోచుకోలేదు.దీంతో అడుగడుగునా గోతులమయంకావడంతో వాహనాలరాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, యువకులు గోతుల్లో మట్టి పోస్తున్నారు. కొన్నిచోట్ల ట్రాక్టర్ల యజమానులు కూడా గుంతలను కప్పుతున్నారు.

ఇది పరిస్థితి

●టీడీపీ ప్రభుత్వహయాంలో 2014-19లో రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో వీఆర్ అగ్రహారం కూడలి నుంచి జి.సిగడాం మండలంలోని పెంట వరకూ ఏడు కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మించారు.ఈ మార్గంలో పొగిరి జంక్షన్ నుంచి బొడ్డవలస వరకూ నిర్మించిన బీటీ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి.

●రాజాం-విజయనగరం మార్గంలోని కొత్తవలస జంక్షన్ నుంచి మారేడుబాక, ఇల్లంనాయుడువలస మీదుగా రింగ్‌రోడ్డు వరకు, గార్రాజు చీపురుపల్లి జంక్షన్ నుంచి బీఎన్‌వలస, ఎంజేవలస, మీదుగా రాజాం-బొబ్బిలిరోడ్ జంక్షన్ వరకూ రింగురోడ్డు సైతం అధ్వానంగా మారింది. ●బొద్దాం నుంచి సోపేరు, రాజాం-పాలకొండ రోడ్‌లో డోలపేట నుంచి గడిముడిదాం, అమరాం, దోసరి రోడ్, కంచరాం నుంచి ఆగూరు మీదుగా దోసరి రోడ్‌పై నడకా నరకంగానే మారింది. ●రాజాం పట్టణం కేంద్రంగా శ్యాంపురం, నందబలగ, లక్ష్మీపురం,కొతారిపురం మీదుగా రాజాం- విజయనగరం రోడ్‌ను కలిపే రింగు రోడ్డు మరమ్మతులు కోరుతోంది.●రాజాం మునిసిపాలిటీ పరిధిలోని కొండంపేట నుంచి బుచ్చెంపేట మార్గంలో వీర్రాజు చెరువు గట్టు ప్రమాదకరంగా మారింది. ఈమార్గంలో వందలాది మంది వాహన చోదకులు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.



వీఆర్‌అగ్రహారం బీటీరోడ్డుపై గుంతలను మట్టితో కప్పిన దృశ్యం

ప్రతిపాదనలు పంపించాం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల ఏర్పాటు, మరమ్మతులకు అవసరమైన అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావు తెలిపారు. రోడ్ల పరిస్థితిని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి సైతం తీసుకువెళ్లామని చెప్పారు. అవసరమైన నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు.

15న హుండీ లెక్కింపు

విజయనగరం కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం ఈనెల 15న శివాలయం వీధిలోగల కల్యాణ మండపంలో జరగనుందనిఈవో కె.శిరీష తెలిపారు. తొలేళ్లు, సిరిమానోత్సవం సందర్భంగా వచ్చిన ఆదాయం లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

19న చిత్రలేఖనం పోటీలు

రాజాం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు వేర్వేరుగా ఈనెల 19న చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్న ట్లు వికాసతరంగిణి రాజాంశాఖ అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు తెలిపారు. బుధవారం రాజాంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ రామాయణంలోని ముఖ్యమైన సన్నివేశాలు విద్యార్థులకు పరిచయం చేయాలన్న ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

గుర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే మహా భాగ్యమని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర తెలిపారు.బుధవారం తెట్టంగిలో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డిజైన్ కిట్ల వితరణ

విజయనగరం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం శివార్లలోని జేఎన్‌టీయూ గురజాడ ఇంజనీరింగు కళాశాలలో ఈసీఈ విభాగానికి డ్రీమ్ చిప్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ నాలుగు వీఎల్ఎస్ వన్ డిజైన్ కిట్లు అందించింది. కిట్లు ఎఫ్‌పీజీఏ ఆధారిత చిప్ డిజైన్ వెరిఫికేషన్ కార్యకలాపాలకు అవసరమైన సాంకేతిక మద్దతుతో రూపొందించారు. సంస్థ ప్రతినిధి గోపీకుమారు బులుసు మురళీ, జేఎన్‌టీయూ విభాగాధిపతి కేసీబీ రావుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన

గరివిడి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని శ్రీరాంనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మానసికఆరోగ్య వారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కెరీర్‌అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ మంజు భార్గవి విద్యార్థులకు మానసిక ఒత్తిడి ఎలా అధిగమించాలో అవగాహనకల్పించారు. ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.నిర్మలా పాల్గొన్నారు.

ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి

రాజాం అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దుకాణాల వద్ద ధరలు పట్టికలు ఏర్పాటు చేయాలని జీఎస్టీ సహాయ కమిషనర్ రాధ సూచించారు. బుధవారం రాజాం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావుతో సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాలపై చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ ప్రకారం కమర్షియల్ ఇతర సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని, స్కూల్స్, కళాశాలల్లోని విద్యార్థులతో అవగాహనకార్యక్రమాలు నిర్వహించాలని, సూచించారు సమావేశంలో అకౌంట్స్ అధికారి సాయిరామ్ పాల్గొన్నారు.

విజ్ఞాపన సభను విజయవంతం చేయాలి

రేగిడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-98 ద్వారా ఎంటీఎస్ పద్ధతిలో కాంట్రాక్ట్ విధానంలో నియమితులైన ఉపాధ్యాయులను ప్రభుత్వంతక్షణమే రెగ్యులర్ చేయాలని ఈనెల 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న విజ్ఞాపన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నేతలు ఎస్.రాజగోపాల్‌నాయుడు, సీహెచ్ మల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటం తరువాత 2023లో ప్రభుత్వం ఎంటీఎస్ పద్ధతిలో నియమించి వెట్టిచాకిరి చేయిస్తోందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం తమ సర్వీస్‌ను రెగ్యులర్‌చేసి ఆదుకోవాలని కోరారు.

ఆత్మరామ-గీత ఆధ్యాత్మిక సాఫ్ట్ స్కిల్స్ పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో పైడిమాంబ దార్శనికతపై తత్వశాస్త్ర స్ఫూర్తిదాయకమైన ఆత్మరామ-గీత ఆధ్యాత్మిక సాఫ్ట్ స్కిల్స్ గ్రంథాన్ని స్వామితత్వ విదానంద సరస్వతి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమెరికాలోని హర్ష విద్యా గురుకులం ఉపాధ్యక్షుడు ఆచార్య మహామహోపాధ్యాయ స్వామితత్వ విదానంద సరస్వతికి డీన్‌వాన్ లెవన్ పీస్ స్టడీ సెంటర్ ఇండియా ద్వారా ఆధ్యాత్మిక శాస్త్రవేత్త అవార్డు ప్రదానం చేశారు.

రాజాపులోవలో గ్రామసభ రసాభాస

●ఇరువర్గాల బాహాబాహీ ● పోలీసుల రంగ ప్రవేశం

భోగాపురం,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజాపులోవ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో సభను నిలిపివేశారు. పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ కిలారిస్వప్న అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. తొలుత పలుఇళ్లపై నుంచి విద్యుత్ కండక్టర్ వైర్లు వెళ్తుండడంతో తొలగించడానికి కొంతఖర్చవుతుందని,వీటిని సంబంధించి పంచాయతీతీర్మానించాలని పలువురు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు.గ్రామసభ జరుగుతుండగా జనసేన మండలాధ్యక్షుడు వందనాల రమణ, మరికొందరు వచ్చి తీర్మానించాలని వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించడంతో పాటు తీర్మానించాలని పట్టుపట్టారు.దీంతో అక్కడ వైసీపీ,జనసేనకు చెందిన ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది.పంచాయతీ కార్యాలయం ఆవరణలో కేకలతో హోరెత్తడం వల్ల సమాచారం అందుకున్న మహిళాపోలీస్ పార్వతి,కానిస్టేబుల్ చేరుకొని ఇరువర్గాలను సర్దిచెప్పారు. దీంతో గ్రామసభ నిలిపివేసి సర్పంచ్ స్వప్న,రమణ, వైసీపీ వర్గీయులు కార్యాలయం నుంచి బయటికి వచ్చేశారు. బయట కూడా ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతోవారిని పోలీసులు విడదీసి అక్కడ నుంచి పంపించివేశారు. తీర్మానం చేయకపోవడంపై కొంతసమయం జనసేననాయకులు ప్లకార్డులు పట్టుకొని పంచాయతీకార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.అనంతరం జనసేన మండలాధ్యక్షుడు వందనాల రమణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడానికి తీర్మానించకపోగా తమ కార్య కర్తలపై దౌర్జన్యానికి దిగడం దారుణంగా ఉందన్నారు. కార్యదర్శి ఎ.సంతోష్ కుమార్ మాట్లాడుతూ గ్రామసభ నిలిపివేయడంపై ఈవోపీఆర్డీ దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



భోగాపురం: ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

జాగరంలో గ్రామసభ

జామి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జాగరం గ్రామస్థులు కోరారు. బుధవారం మండలంలోని జాగరంలో నిర్వహించిన గ్రామసభలో పలువురు యువకులు, సర్పంచ్ వని పార్వతీ తదితరులు మాట్లాడుతూ కొందరు సిబ్బంది విశాఖనుంచి రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు.

సీజేపై దాడియత్నం అప్రజాస్వామికం

● జిల్లా వ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం అప్రజాస్వామికమని పలు సంఘాల నాయకులు పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం జిల్లాలోని పలుచోట్ల పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

●విజయనగరం క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించడం అప్రజాస్వామికమని అంబేడ్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి పేర్కొన్నారు. బుధవారం విజయనగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీజేపై దాడికి యత్నానికి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పి.ప్రభాకరరావు,శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్, వెంకటేష్, వంశీ పాల్గొన్నారు.

●కొత్తవలస, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై కోర్టులో విచారణ జరిగే సమయంలో న్యాయవాది కోర్టు రాకేష్ శర్మ బూటు విసిరే ప్రయత్నం చేసేందుకు నిరసనగా కొత్తవలస న్యాయవాద సంఘం న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు.గురువారం కూడా విధులు బహిష్కరించ నున్నట్లు న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు.

● చీపురుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడానికి యత్నంచడమంటే భారత రాజ్యాంగంపై దాడి చేయడమనని, అటువంటి దోషులకు కఠిన శిక్షలు విధించాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. చీపురుపల్లికి చెందిన దళితనాయకులు గంటాన అప్పారావు, ఎంపీ రాజు, టొంపల సంజీవి, బూర సూర్యనారాయణ తదితరులు మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనతెలిపారు.కార్యక్రమంలో యందవ పోలయ్య, బోడసింగి అప్పలరాజు, రేగిడి రామకృష్ణ, రాము, దన్నాన రవి, రాజేష్ పాల్గొన్నారు.



విజయనగరం క్రైం:అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి కోరారు. బుధవారం ఎస్.కోట మండలపరిషత్‌కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీలకు రెవెన్యూ సమకూర్చేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలబొడ్డవరలో గ్రామసభ కోసం గ్రామస్థులు దరఖాస్తు చేస్తే పెట్టకుండ అధికారులకు లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పెదఖండేపల్లి కార్యదర్శి గ్రామసభకు ఎజెండా ఇచ్చి గ్రామసభలకు ప్రజలంతా వచ్చినతరువాత గైర్హాజరవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండ కార్యదర్శులు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

మహిళా క్రికెట్ జట్టుకి పొగిరి విద్యార్థినుల ఎంపిక

రాజాం, అక్టోబరు 8,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొగిరి హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థి పూజిత, తొమ్మిదోతరగతి విద్యార్థిని యోషినిలు అండర్-19, అండర్-17రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మావతి బుధవారం తెలిపారు. ఈనెల ఏడో తేదీన శ్రీకాకుళంలో జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ సెలక్షన్‌లో వీరు రాణించినట్లు వ్యాయమ ఉపాధ్యాయులు సంతోషి, త్రినాథరావు పేర్కొన్నారు. ఎంపికైన ఇద్దరిని గ్రామస్థులు, హెచ్‌ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

పంటకోత ప్రయోగంలో కచ్చితత్వం ఉండాలి

లక్కవరపుకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరిపంటలో పంటకోత ప్రయోగం కచ్చితమైన కొలతలతో ఉండాలని ఏవో హరికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏఎస్‌వో కృష్ణ, హార్టికల్చర్ అధికారి పద్మలతో కలిసి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పంటకోత ప్రయోగం జరిగి దిగుబడులు లెక్క వేయాలని, దిగుబడిని బట్టి బీమా అమలు అవుతుందని తెలిపారు.

చీపురుపల్లిలో సర్పంచ్‌లకు శిక్షణ

చీపురుపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో రెండురోజుల పాటు జరిగిన సర్పంచ్‌లు,కార్యదర్శులు, డిజిటల్ సహాయకుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆదాయ పెంపుదలకు సహకరించే వనరులు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు, అభివృద్ధి ప్రణాళికల రూప కల్పన తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఎంపీడీవో ఐ.సురేష్, డిప్యూటీ ఎంపీడీవో టి.ప్రవీణ్‌కుమార్‌లు రిసోర్సుపర్సన్లుగా వ్యవహరించారు.

వక్తృత్వ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు

నెల్లిమర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు వైల్డ్‌లైఫ్ వీక్‌ను పురస్కరించుకొని విశాఖ ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల అధికారులు ఉత్తరాంధ్రస్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో సత్తాచాటారు. చిత్రలేఖనం పోటీల్లో పతివాడ షర్మిలకు ద్వితీయ,పతివాడ మేఘన తృతీయ బహుమతిసాధించింది. డ్రోన్లు, కెమెరా ట్రాప్‌లపై ఆర్టిఫిషియన్ ఇంటిలిజెన్స్ పాత్ర అన్న అంశంపై మేఘనకు బహుమతి లభించింది. విద్యార్థినులను హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రధాన రహదారి పనులు పూర్తిచేయాలి

రాజాం అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని ప్రధాన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారి పనులు సకాలంలో పూర్తిచేసేలా కృషి చేయాలని బీజేపీ నాయకులు కోరారు.బుధవారం మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావును ఆ పార్టీ నాయకులు కలిశారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ డైరెక్టర్ కొటగిరి నారాయణరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు, గుడివాడ నాగరాజు, సామంతుల రమణనాయుడు పాల్గొన్నారు.

చెత్తను ఇళ్ల ముందు నిల్వ చేయవద్దు

రాజాం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ చెత్తను ఇళ్లముందు నిల్వ చేయకుండా చెత్తబండికి అందించాలని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పెనుబాకలో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను ఇళ్లముందు నిల్వ చేయడం లవ్ల వర్షం కురిస్తే దోమలు, ఈగలు చేరి ప్రజలు రోగాలు బారిన పడే అవకాశం ఉందన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయించవద్దు

బొండపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, తయారు చేసినా, నిల్వ చేసినా చర్యలు తప్పవని సీఐ ఈవీవీ రమణ హెచ్చరించారు. మండలంలోని నెలివాడ, రోళ్లవాక గ్రామాల్లో విజయనగరంలోని దీపావళి సామగ్రికి సంబంధించిన మందుగుండు సామగ్రికి చెందిన గోదాములు ఏర్పాటుచేశారు.ఈ మేరకు వాటిని బుధవారం గజపతినగరం సీఐ ఈవీవీ రమణతోపాటు ఎస్ఐ యు.మహేష్‌లు పరిశీలించారు.



నెలివాడలో బాణసంచా గోదామును పరిశీలిస్తున్న సీఐ రమణ

రీసర్వేకి రైతులు సహకరించాలి

భోగాపురం, అక్టోబరు8 (ఆంధ్ర జ్యోతి): రీసర్వే పక్కాగా నిర్వహిస్తామని, దీనికి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ రమణమ్మ కోరారు. బుధవారం మండలంలోని కవులవాడలోరీసర్వేకు సంబం దించిన గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా గతంలో తప్పులుగా నమోదు కావడంతో ఇప్పటికి సరిదిద్దుకోవడానికి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షణలు చేసినా ఫలితం లేదని కవులవాడ, బసవపాలెం గ్రామాలకు చెందిన రైతులు వాపోయారు. కార్యక్రమంలో డీఐఎస్ సూర్యభగవాన్, సర్వేయరు మధు కేశవరావు, సర్వే డీటీ రవి, వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ తేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణమ్మ

ధర్మవరంలో గౌరీ పరమేశ్వర ఉత్సవాలు

ఎస్.కోట రూరల్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీ పరమేశ్వర ఉత్సవాల నిర్వహించారు. బుధవారం వేకువజామున సంప్రదాయబద్ధంగా వరికంకులను మహిళలు ఊరేగించారు.అనంతరం గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలుచేశారు.

ప్రారంభానికి నోచుకోని పంచాయతీ భవనం

వేపాడ, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిగిపాలెంలో పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో భవనంప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకునే అవకాశముందని గ్రామస్థులు చెబుతున్నారు.దీనికితోడు పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతోపాటు పిచ్చిమొక్కలుపెరగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పాలకవర్గ సమావేశాలు పరాయి పంచన నిర్వహిస్తున్నారు. కార్యదర్శి పంచాయతీ రికార్డులు అంగన్‌వాడీ కేంద్రంలో భద్రపరుస్తున్నారు. కాగా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి భవనం ప్రారంభానికి చర్యలు చేపడతామని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు.



పనులు పూర్తయిన పంచాయతీ భవనం

చికిత్సపొందుతూ బీట్ అధికారి మృతి

సాలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బంగారమ్మ కాలనీలో నివాసముంటున్న అటవీశాఖ బీట్‌అధికారి ముద్ద శ్రీకాంత్ (42) చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. శీకాంత్ భార్య నాగజ్యోతి, పోలీసుల కథనం మేరకు.. పాడేరుకు చెందిన శ్రీకాంత్‌తో 2014లో నాగజ్యోతికి వివాహం జరిగింది. శ్రీకాంత్ సాలూరు అటవీశాఖలో బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. స్థానిక బంగారమ్మకాలనీలో నివాసముంటున్నారు. అయితే ఈనెల ఒకటో తేదీన విజయనగరంలోని తన కన్నవారి ఇంటికి దసరా, పైడితల్లమ్మ పండుగకోసం కుమారుడితో కలిసి నాగజ్యోతి వెళ్లింది. మంగళవారం ఉదయం శ్రీకాంత్ గడ్డిమందు తాగి బంగారమ్మకాలనీ నుంచి మానాపురం సమీపంలోఉన్న గుడివాడకు డ్యూటీలో భాగంగావెళ్లాడు. అక్కడ శ్రీకాంత్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో అటవీశాఖ అధికారులు నాగజ్యోతికి సమాచారం ఇచ్చారు.వెంటనే ఆమె గుడివాడ వెళ్లి శ్రీకాంత్‌ను విజయనగరం మహారాజా ఆసుపత్రికితరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం శ్రీకాంత్ మృతి చెందాడు. పట్టణ సీఐ అప్పలనాయుడు కేసు నమోదుచేశారు.

చెట్టుకూలి ఒకరు..

కొమరాడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తీలేసులో బుధవారం విషాదం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని కొండపై పోడు వ్యవసాయం పనులు చేస్తున్న పువ్వల రామారావు (47)పై మామిడి చెట్టు విరిగి పడింది.దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య సలామ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

రైళ్లలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న గంట్యాడ మండలంలోని కొండతామరపల్లికి చెందిన కోన గౌరీశంకర్‌ను రైల్వే స్టేషన్ సమీపంలో అరెస్టుచేసినట్లు జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీ రావు తెలిపారు. గతంలో రైళ్లలో దొంగతనాలుచేసి సుమారు రూ. నాలుగు లక్షల విలువైన 40 గ్రాముల బంగారు అభరణాలు, రూ.10 వేలు విలువల మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

బొండపల్లి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):మండలంలోని బోడసింగిపేట గ్రామానికి వద్ద గల పెట్రోల్ బంకుకు సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గజపతినగరం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తున్న బైక్‌ను విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఢీకొట్టింది.దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి తనది రామభద్రపురం అని చెప్పి కోమాలోకి వెళ్లడంతో తమకు ఎటువంటి ఫిర్యాదు ప్రమాదానికి సంబంధించి అందలేదని ఎస్ఐ మహేష్ తెలిపారు. గాయపడిన వ్యక్తిని జిల్లా కేంద్రాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే బొండపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పార్వతీపురం నుంచి బి.రాజేరు పైల ఈశ్వరరావు బైక్‌పై భార్య, ఇద్దరు కుమార్తెలతో వస్తున్నాడు. విజయనగరం వైపు నుంచి గజపతినగరం వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. గాయపడిన ఈశ్వరరావును గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు.

పిడుగుపాటుకు 14 మేకల మృతి

శృంగవరపుకోట,అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి ఎంపీటీసీ దారగిరికి చెందిన 14 మేకలు మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మృతి చెందిన మేకలను పరిశీలించారు. ఈమేరకు రూ.50వేలు ఆర్థికసాయం ప్రకటించారు.ఆయన వెంట. ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, నాయకులు గంగరాజు, రామకృష్ణ ఉన్నారు.

భూములు వెనక్కి వచ్చే వరకూ పోరాటం



కళ్లకు నల్లగుడ్డలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జిందాల్‌నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించిన భూములు పదేళ్ల తరువాత అమ్ముకునే కుట్ర జరుగుతోందని, దీనిలో భాగంగానే గత ప్రభుత్వం జీవో- 14 ఇచ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లాజగన్ ఆరోపించారు. బుధవారం బొడ్డవర 110 రోజు రిలే దీక్షలో కళ్లకు నల్లగుడ్డలు కట్టుకొని నిరసన నిర్వాసితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భూములు వెనక్కి వచ్చేవరకు, న్యాయం జరిగేవరకు పోరాటబాట వీడమని తెలిపారు.

ఉణుకూరు ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణ



ఉణుకూరులో ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

రేగిడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉణుకూరు ఫీల్డ్‌అసిస్టెంట్ ఎం.జగన్నాథంనాయుడుపై బుధవారం ఉపాధి అధికారులు గ్రామంలో మరోసారి బుధవారం విచారణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఫీల్డ్‌అసిస్టెంట్, ఫిర్యాదుదారుడు మద్దతుదారుల మధ్య వాగ్వాదంచోటుచేసుకుంది. ఫీల్డ్‌అసిస్టెంట్ తప్పుడు మస్టర్లతో నిధులు స్వాహా చేయడం తదితర అభియోగాలతో గ్రామానికి చెందిన పి.విశ్వనాథం పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై గతంలో విజయనగరం క్లస్టర్ ఏపీడీ విచారణచేశారు. ఈవిచారణ సంతృప్తిచెందని ఆయన మరోసారి ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. దీనిపై ఉపాధిపీడీ ఆదేశాలతో రాజాం క్లస్టర్ ఉపాధి ఏపీడీ చంద్రావతి మరోసారి సమగ్రవిచారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, జేఈ మురళి, వెంకటేశ్వరరావు, బాలమురళీధర్, టీఏ భారతి పాల్గొన్నారు.

పథకాలకు దూరంగా పేదలు

(ఐదో పేజీ తరువాయి)

భూములు అధికంగా వున్నవారి వద్ద కూడా రేషన్ కార్డులున్నాయి. రికార్డుల్లో నమోదైన బీపీఎల్ కుటుంబాల కంటే రేషన్ కార్డులు అధికంగా ఉన్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయి. ప్రభుత్వ పథకాలకు అర్హత లేకపోయినా రేషన్ కార్డు ఆధారంగా వాటన్నింటినీ పొందుతున్నారు. ప్రభుత్వానికి ఈ విషయం తెలిసినా వాటిని తొలగించలేక పోతున్నారు. ఓట్లను నష్టపోతామే మోనన్న భయంతో నేతలు వెనకడుగు వేస్తున్నారు. అయితే అనర్హుల వద్ద వున్న రేషన్ కార్డులు తొలగించలేకపోతున్న ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులను ఇవ్వలేకపోతోంది. రెండు నెలల కిందట రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొత్త కార్డుల మంజూరుకు అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించారు. అయితే హౌస్‌హోల్డ్ సర్వేలో నమోదైన కుటుంబాలను విభజించేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో కొత్తగా రేషన్‌కార్డులు పొందేందుకు అనేక మంది దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. సామాజిక పింఛన్లనూ పొందలేకపోతున్నారు.

● అర్హత ఉండి పథకాలు అందుకోలేకపోతున్నవారు ప్రతి గ్రామం లోనూ పది కుటుంబాల వరకు ఉంటున్నాయి. కూటమి నేతలు గ్రామాలకు వెళ్లినప్పుడు వారంతా అడుగుతున్నారు. ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక ప్రజాప్రతినిధులు ఏదో ఒకటి చెప్పి తప్పించుకు తిరుగుతున్నారు. హౌస్‌హోల్డ్ సర్వేలో తామంతా ఒకే కుటుంబంగా నమోదు కావడంతో ఇబ్బందిగా మారిందని చెబుతున్న మాటలకు తెల్లమొహం వేసుకొని చూస్తున్నారు.

● తెలుగుదేశం ప్రభుత్వం 2016లో కుటుంబ గణన చేపట్టాక కుటుంబ సభ్యుల అందరి వివరాలతో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసింది. ఒక చోట కలిసి ఉంటున్న కుటుంబ సభ్యుల వివరాలన్నింటినీ నమోదు చేసింది. దీని ఆధారంగా రేషన్ కార్డులు ఇచ్చింది. ఒక రేషన్ కార్డుకు ఒకే సామాజిక పింఛన్‌ను అందించేది. దివ్యాంగుల విషయంలో మినహాయింపు ఇచ్చింది. వృద్ధాప్య, వితంతు వంటి సామాజిక పింఛన్లు మాత్రం కార్డులో ఒక్కరికి మాత్రమే పరిమితం చేశారు.

● గత వైసీపీ ప్రభుత్వం సిక్స్‌స్టెప్ అర్హతను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇన్‌కంట్యాక్స్ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగి, మూడు ఎకరాలు పైబడి జిరాయితీ, పది ఎకరాల మెట్టు భూమి ఉన్నవారు, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారు, 300 యూనిట్లు పైబడి విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న కుటుంబాలను రేషన్‌కార్డు పొందేందుకు అనర్హులుగా నిర్ణయించారు. వీటి పరిధిలో లేనివారు చాలా మంది వున్నప్పటికీ హౌస్‌హోల్డ్ సర్వే మ్యాపింగ్‌ను చూపించి వీరెవ్వరికీ రేషన్ కార్డులు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. అడిగేవారందరికి దీన్నే సాకుగా చూపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీన్ని సరిచేస్తారని అంతా భావిస్తున్నారు.

● కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు దరఖాస్తులను స్వీకరించడంతో అంతా సంబరపడ్డారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఒకే కుటుంబంగా నమోదైన వారికి దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం లేదని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చెప్పడంతో నిరాశ చెందారు. తల్లిదండ్రులతో కలిసి ఉన్న కుమారులు వివాహం అనంతరం రేషన్ కార్డుల నుంచి తప్పుకొనేందుకు అవకాశం కల్పించినట్లే హౌస్‌హోల్డ్ సర్వే నుంచి తప్పుకొనేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం ఇస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

(ఐదో పేజీ తరువాయి)

అవగాహన తరగతులు నిర్వహించి విద్యార్థులకు పోటీలు కూడా నిర్వహించాలన్నారు. విజేతల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్యశాఖ ద్వారా ప్రైవేటు ఆసుపత్రుల వద్ద ఫార్మా కంపెనీల వద్ద సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై పోస్టర్‌ను ఆవిష్కరించాలన్నారు. ఈ-క్రాప్ నమోదును ఈనెల 25లోగా పూర్తి చేయాలన్నారు.

● విభిన్నప్రతిభావంతుల పెన్షన్ పునర్ మూల్యాంకణంలో భాగంగా అర్హత తక్కువగా నిర్ధారించినబడిన వారు అప్పీలు చేసే సందర్భంలో వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సదరం శిబిరాలు ప్రారంభం అయ్యాయని కలెక్టరు రామసుందర్ రెడ్డి తెలిపారు. అప్పీల్ చేసిన విభిన్న ప్రతిభావంతుల వివరాలను ఆసుపత్రులకు మ్యాపింగ్ చేసి ఎంపీడీవో లాగిన్‌లో నోటీసులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. క్యాంపులకు లబ్ధిదారులు హాజరుకాకపోతే పింఛను రాదన్నారు.

కలలు కనండి... సాకారం చేసుకోండి

(ఐదో పేజీ తరువాయి)

పెంపొందించుకునేందుకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహక కమిటీ సభ్య కార్యదర్శి ప్రదీప్‌నాయక్ మాట్లాడుతూ లివింగ్ ఇన్ స్పేస్ అనే థీమ్‌ను వివరించారు.

● ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలపై సూటిగా దాడులు చేసి, సామాన్యులకు ప్రాణనష్టం లేకుండా చేసిన భారత్‌సత్తా వెనుక శాటిలైట్ టెక్నాలజీ పరిజ్ఞానం దాగి ఉందన్నారు. 1960 దశకంలో బుడిబుడి అడుగులు వేసిన మన అంతరిక్ష పరిశోధనా రంగం నేడు మకుటాయమానంగా ఎదిగి ప్రపంచం నివ్వెరపోయేలా తయారైందన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన ప్రదర్శనలను శాస్త్రవేత్తలు సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో సీఐ కటకం సతీష్‌కుమార్, కళాశాల జాయింట్ సెక్రటరీ రావు బదరి, ప్రిన్సిపాల్ సీహెచ్‌వీరేంద్ర కుమార్, అధ్యాపకులు మండల రమేష్, డాక్టర్ చేడిగంజి రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మంచి రోజులు

(ఐదో పేజీ తరువాయి)

నిధులు విడుదల చేశారు. దీనిపై జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరయ్యాయి..

జిల్లా నుంచి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల మేరకు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.28.20 కోట్లు వస్తున్నాయి. వాటితో త్వరితగతిన రోడ్ల పనులు చేపడ్తాం. ఈ ఏడాది జనవరిలో కొంతవరకూ కొలిక్కివచ్చాయి. మిగతా పనులు ఇప్పుడు పూర్తిచేస్తాం.

-కాంతిమతి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ, విజయనగరం

చట్టాలపై అవగాహన పెంచుకోండి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి హరిబాబు



సదస్సులో మాట్లాడుతున్న కార్యదర్శి హరిబాబు

సీతంపేట రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గిరిజనులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. దేవనాపురంలో బుధవారం గిరిజనులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆదివాసీలు చట్టాలకు దూరం కాకుడదన్నారు. న్యాయపరమైన అన్ని హక్కులు గిరిజనులకు వర్తిస్తాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్య నేరమన్నారు. దీనికి శిక్షలు ఉన్నాయని వివరించారు. బాల్యవివాహాలు ఇకపై జరగనివ్వకుండా చూస్తామని గిరిజనులతో ప్రతిజ్ఞ చేయించారు. పిల్లల పట్ల ఎక్కువ సమయం తల్లిదండ్రుల కేటాయించాలన్నారు. దీనివల్ల పిల్లలు, తల్లిదండ్రుల మధ్య అవినాభావ సంబంధాలు బలపడతాయన్నారు. న్యాయ పరంగా ఎటువంటి సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100, లేకుంటే స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీడబ్ల్యూ డీడీ ఎం.అన్నాదొర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్, ఎస్ఐ అమ్మనరావు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం



మెనూ అమలుపై మాట్లాడుతున్న చైర్మన్

పాలకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నక్కలపేట అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల సంఖ్యకు, రికార్డులకు తేడా ఉండటాన్ని గమనించారు. అలాగే కాలం చెల్లిన కందిపప్పు బస్తాను గుర్తించారు. తక్షణమే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాకు, ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్‌లకు మెమోలు జారీ చేయాలన్నారు. అనంతరం ఇందిరానగర్ కాలనీలోని రేషన్‌డిపోను పరిశీలించారు. డిపోలో సరుకులు వ్యత్యాసం ఉండడంపై 6ఎ కేసు నమోదు చేయాలని సీఎస్‌డీటీ సన్యాసిరావుకు ఆదేశించారు.

●సీతంపేట ఏజెన్సీలో బుధవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. గొయిది అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ చిన్నారుల కోసం వండిపెట్టే నిత్యవసర సరుకుల ను పరిశీలించారు. సరుకుల్లో కాలం చెల్లినవి కొన్ని ఉండటంతో వర్కర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి లకు షోకాజ్ నోటీసు జారీచేయాలని సీడీపీవో సుమ్మాలమ్మను ఆదేశిచారు.

●భామిని: విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేలా చదవాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఏపీ ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహన్ని ఆయన సందర్శించారు.

●గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆహారంలో నాణ్యత, మెనూ పాటించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, భ ద్రగిరి బాలికల గురుకుల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వీర్‌సింగ్, టీడబ్ల్యూడీ కృష్ణవేణి, ఏటీడబ్ల్యూవో రజని ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే జయకృష్ణ



ఎస్పీతో ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఎస్పీ మాధవరెడ్డిని బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై మాట్లాడారు. ఆయనతో పాటు పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

●పాలకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురపాం మండలం శివన్నపేట గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థినులను బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పరామర్శించారు. విద్యార్థినులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థినులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

జియ్యమ్మవలస, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో జ్ఞానప్రకాశ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి హెచ్‌ఎం వి.ధనుంజయనాయుడుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఎంవో పుష్పనాథం ఉన్నారు.

తాగునీటి పైపులకు మరమ్మతులు

సాలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన పట్టణ ప్రధాన తాగునీటి పైపులను బుధవారం మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తయిన వెంటనే తాగునీటిని సరఫరా చేస్తామని డీఈ ప్రసాద్ తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

బొబ్బిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం వీధిలో ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ మహా అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణి నుంచి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు తీసుకో వాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి త్రినాథ, ఎ.వెంకటరమణ, ఎంఎస్‌కె రాధ, సెక్టార్ సూపర్‌వైజర్ రమా కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, సునీత, రోజా తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

సీతానగరం (బలిజిపేట), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం బలిజిపేట మండలంలోని పలగర పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. నాగార్జునతో పాటు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పెంపు ఘనత చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతుందంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ కారకులన్నారు. పీఏసీఎస్ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో ఇద్దరు విద్యార్థుల మృతి అవాస్తవం

బెలగాం, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): పచ్చకామెర్లతో కురుపాం గురుకులానికి చెందిన మరో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని డీఎంహెచ్‌వో డా.భాస్కరరావు అన్నారు. బుధవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం నలుగురు విద్యార్థులు పచ్చకామెర్ల వ్యాధితో మృతి చెందారని జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఇద్దరు గురుకులం విద్యార్థినులు గత నెలలో మృతి చెందారన్నారు.

నాగరాజుకు సత్కారం

బొబ్బిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానంలో భాగంగా జిల్లాస్థాయి వారియర్‌గా ఎంపికైన బొబ్బిలి మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు బంగారి నాగరాజును హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలు బుధవారం ఘనంగా సత్కరించారు. అతడికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పట్టణ ప్రజల ఆరోగ్యాలకు రక్షణగా నిలుస్తున్నారని వారు కొనియాడారు. కార్యక్రమంలో హుదా అధ్యక్షుడు మమ్మద్ రఫీ, జామియా మసీదు అధ్యక్షుడు బాషా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ కల్యాణం

బొబ్బిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):పట్టణ పరిధిలోని చిక్కాలవీధిలో పారిశుధ్య కార్మికుడు బంగారి చిన్నికృష్ణ ఆధ్వర్యంలో బుధవారం శివ కల్యాణం ఘనంగా నిర్వహించారు. నందెన్న సంబరాలలో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ స్థాయి ధర్మప్రచారకుడు ధూపం వాసు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలపై చర్యలు చేపడతాం

రామభద్రపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తతప్పవని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో అసత్య ప్రచారాలు చేస్తే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం సోషల్ మీడియాపై నిఘా పెంచామ న్నారు. వ్యక్తుల గౌరవానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. పంచా యతీల్లో మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసినా, వేలం పాటలు వేసినా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నాటు తుపాకులను పోలీసులకు అప్పగించాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు.

సత్తా చాటిన 'గ్లోబల్ వ్యూ స్కూల్' విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

రామభద్రపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా బుధవారం బొబ్బిలి ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 7, 8 తరగతుల విభాగాల్లో కోమలి ప్రథమ స్థానంలో నిలిచింది. 9, 10 తరగతుల విభాగాల్లో వి.వి.ఎస్.ఛరిష్మా ద్వితీయ స్థానం దక్కించుకుంది. వారిని గ్లోబల్ వ్యూ పాఠశాల చైర్మన్ పోల వెంకటరమణ, కరస్పాండెంట్ పోల చంద్రమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడల్లో కొట్టక్కి విద్యార్థుల ప్రతిభ



షీల్డ్ సాధించిన విద్యార్థినులు

రామభద్రపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొట్టక్కి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. ఈ నెల 4, 5 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా కె.డి.పేటలో నిర్వహించిన 12వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలికలు రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచారు. సామిరెడ్డి వర్షిణి, కుమిలి మౌనిక, బత్తుల త్రిలోచన షీల్డు, మెడల్స్ సాధించారు. వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ వీరంనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నందన్న పూజలు



ముత్తాయవలసలో మహిళల పూజలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నందన్న ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ముత్తాయవలసలో సర్పంచ్ పి.వసుంధర ఆధ్వర్యంలో నందన్న ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో చేపడుతున్నారు. ఈసందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

తూటికాడ కషాయంతో సుడిదోమ నివారణ



కషాయం తయారీ చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సుడి దోమ నివారణకు తూటికాడ కషాయాన్ని వాడాలని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు అన్నారు. అలాగే పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జగన్నాథపురంలో బుధవారం తూటికాడ కషాయం రైతుల సమక్షంలో తయారుచేశారు. ఎలా వాడాలి, ఎంత మోతాదులో వాడాలనే దానిపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకురాలు స్వర్ణ మాట్లాడుతూ ప్రకృతిలో లభించే ఆకులతో కూడిన కషాయాలు తయారు చేసుకుని వినియో గిస్తే మేలు జరుగుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్ శ్రీను పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

బొబ్బిలి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా అమలు, రైతులకు బీమా చెల్లించడానికి వరి పంట కోత ప్రయోగాలు, దిగుబడి కీలకమని మండల వ్యవసాయ అధికారి మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలోబుధవారం తహసీల్దార్ శ్రీను ఆధ్వర్యంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామానికి నాలుగు వరి పంట కోత ప్రయోగాలు చేస్తామన్నారు. ఎటువంటి తప్పిదాలకు చోటివ్వరాదని ఏవో సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కురపాం గురుకుల పాఠశాల విద్యార్థులకు పచ్చకామెర్లు సోకిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీడబ్ల్యూడీడీలు, ఏటీడబ్ల్యూవోలు, ఎస్టీ గురుకుల పాఠశాల యాజమాన్యంతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం పూర్తి శ్రద్ధ చూపాలన్నారు. విద్యా సంస్థలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు, హెల్త్ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు.

సొంతింటిపై ఆశలు

(ఐదో పేజీ తరువాయి)

ఏజెన్సీ అర్థాంతరంగా పనులు ఆపేసింది. నెల్లిమర్లతో పాటు రాజాంలో ఇంకా అనేక భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అటు మౌలిక వసతులూ కల్పించాలి.

కాంట్రాక్టర్ల విముఖత..

కాంట్రాక్టర్లకు రూ.40 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. మరో రూ.89 కోట్లు మంజూరైతే కానీ భవనాల పనులు ముందుకు కదలని పరిస్థితి. దీనిపై జిల్లా అధికారులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. శాసనసభ వేదికగా మంత్రి నారాయణ స్పష్టమైన ప్రకటన చేయడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.

రెండువైపులా ఇబ్బందులు..

బ్యాంకు రుణాలతో అప్పట్లో టిడ్కో ఇళ్లను మంజూరు చేశారు. 2024తో మారటోరియం గడువు ముగియడంతో బ్యాంకులకు రుణాల చెల్లింపులు ప్రారంభమయ్యాయి, ఒక్కో లబ్ధిదారుడు రూ.4 వేలకు తగ్గకుండా ఈఎంఐలు చెల్లించాలి. దీనికితోడు ఇప్పుడుంటున్న ఇళ్లకు అద్దె చెల్లించాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు చాలా ఇబ్బందిపడుతున్నారు. వీలైనంత త్వరగా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని.. మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..

టిడ్కో ఇళ్లకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపాం. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు రూ.129 కోట్లు అవసరమని గుర్తించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

-శశిధర్, టిడ్కో డీఈఈ, విజయనగరం